క్లుప్తంగా

'విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి'


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ధనంజయ మజ్జి

కవిటి: ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్‌ను ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో ధనంజయ మజ్జి సూచించారు. మండలంలోని గొర్లెపాడు ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ట్యాబ్‌ల వినియోగం, విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేదారిపురం గ్రామానికి చెందిన కబీర్ రౌళో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న సన్యాసిపుట్టుగకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ క్లబ్ సంస్థ సభ్యులు అండగా నిలిచారు. బాధితునికి రూ.7 వేల ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంపత్‌రావు

మందస: మండలంలోని వీరగున్నమ్మపురం సమీపంలో ఉన్న కేజీబీవీలో విద్యార్థినులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావు ఆధ్వర్యంలో పరీక్షలు చేపట్టారు. అవసరమైన విద్యార్థినులకు మందులు అందజేశారు. మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎన్ఎం, ఆశవర్కర్లు నిత్యం విద్యార్థినుల ఆరోగ్యాన్ని గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రఘుపాత్రుని వాసంతి, హెల్త్ విజిటర్ పద్మాలత, ఎంఎల్‌హెచ్‌పీ సౌందర్య, ఎస్.కాంతారావు, ఎల్టీ వై.నాగరాజు, ఆశావర్కర్లు రోహిణి, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శీలా కంటి ఆస్పత్రి వైద్యురాలు శీలా మాట్లాడుతూ.. విద్యార్థులు నేత్రాలను పరిరక్షించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలను నిర్వహించి, అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. ఆరోగ్య సూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రశంసలు


ఎస్పీ రాధిక నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఎస్పీ జి.ఆర్.రాధిక పలువురు పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కేసుల దర్యాప్తు, చార్జిషీటు దాఖలు, వాటి పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు వంటి అంశాలలో కృషి చేసిన కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

పరామర్శ


మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన బొట్టా తాతయ్య(57) ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయనతోపాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఆర్బీకే అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, స్థానిక నేతలు మద్దు వెంకటరావు, మద్దిల భీమారావు తదితరులు ఉన్నారు.


భక్తులతో మాట్లాడుతున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి


పొన్నచెట్ల వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న వాసుదేవుడు

సర్వాంతర్యామి.. శ్రీమన్నారాయణుడు

- కనులపండువగా తెప్పోత్సవం
- పొన్నచెట్టు వాహనంపై ఊరేగిన వాసుదేవుడు

వాసుదేవుని బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు బుధవారం పొన్నచెట్టు వాహనసేవ, శ్రీవాసుదేవపూజ, తెప్పోత్సవం, అశ్వవాహనసేవ, దోపిడీ ఉత్సవం కనులపండువగా జరిగాయి. శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, పవన్‌స్వామి, వేదపండితుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రధాన శిష్యులు శ్రీత్రిదండి అహోబిల రామానుజజీయర్‌స్వామి మాట్లాడుతూ.. స్వామివారు సంగీత ప్రియుడన్నారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరామానుజన సేవాసంఘం గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ కార్యదర్శి శానాపతి కిషోర్‌కుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు దేవరశెట్టి మార్కండేయులు, కరతల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. – మందస


వాసుదేవుని పూజ జరిపిస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి


కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం


భక్తి కీర్తనలు ఆలపిస్తున్న చాణక్య తదితరులు

రైతులకు అండగా ప్రభుత్వం

- ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు చర్యలు
- కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్
- నందిగాం మండల సర్వసభ్య సమావేశంలో వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్ తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరి శ్రీరామమూర్తి అధ్యక్షతన ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సభ ప్రారంభంలో పెద్దలవునిపల్లి సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతుల వద్ద ధాన్యం ఉన్నప్పటికీ టార్గెట్‌లు పూర్తవ్వడంతో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని, టార్గెట్‌లు పెంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. దీనికి తిలక్ స్పందించి ధాన్యం కొనుగోలు సమస్యను కలెక్టర్ నుంచి కమిషనర్ వరకు తెలియజేశామని, ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా కల్పించండని సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట పొలాలకు మట్టి రోడ్లు వేయాలని ఏపీవో నాగరాజుకు ఆదేశించారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని గృహనిర్మాణ సంస్థ ఏఈ ఆనందరావు కోరారు. జల్ జీవన్ మిషన్ పనులు చేసేటప్పుడు తప్పనిసరిగా స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి వారి సూచనలు, సలహాలు తీసుకోవాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆర్‌డబ్ల్యూస్ ఏఈ మధుకు సూచించారు. మణిగాంలో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని గతంలో సర్వే చేసిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ సిబ్బందికి తిలక్ తెలియజేశారు. హరిదాసుపురంలో వేలిముద్రలు వేయించుకొని రేషన్ ఇవ్వని విషయంపై విచారణ జరిపి లబ్ధిదారులకు రేషన్ ఇప్పించాలని ఆర్‌ఐ ప్రగడ కిరణ్‌కు ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేరాడ భార్గవి, లట్టిగాం, దిమిలాడ పీఏసీఎస్ అధ్యక్షుడు కురమాన బాలకృష్ణారావు, సర్లాన బైరాగి, వైస్ ఎంపీపీ లక్ష్మీకాంతం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహ సారథుల శిక్షణ


మందస: పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశీబుగ్గ: పలాస మండలం పరిధిలో ఉన్నటువంటి 19 పంచాయతీలకు చెందిన గృహ సారథులకు గురువారం శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదలయ్యింది. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

20వ తేదీన శిక్షణ

మందస: మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణా కార్యక్రమం ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, బాలిగాం పీఏసీఎస్ ఛైర్మన్ సాంర్ర ఢిల్లేశ్వరరావులు తెలియజేశారు. ఈ మేరకు హరిపురంలో పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వారితో పాటు హరిపురం సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం, ఎంపీటీసీ ఆనల అప్పన్న, పార్టీ నాయకులు పసుపురెడ్డి రాము, దున్న హరికృష్ణ, దువ్వు నారాయణరావు, నాగేశ్వర బృందావన్ తదితరులు ఉన్నారు.

ఆత్మస్థైర్యంతోనే లక్ష్య సాధన


ఇచ్ఛాపురం: విద్యార్థులకు సూచనలిస్తున్న అప్పన్న

ఇచ్ఛాపురం: విద్యార్థులకు ఆత్మస్థైర్యం ఉంటే లక్ష్య సాధన సులభమని శ్రీకాకుళం డైట్ కాలేజీ సైకాలజీ లెక్చరర్ ఎ.అప్పన్న అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధమవ్వాలనే విషయంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డీవీవీ త్రినాథరావు, సిబ్బంది, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కె.భీష్మ తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథం అవసరం

సోంపేట: పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై సానుకూల దృక్పథంతో ఉండాలని స్థానిక బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం జి.తేజావతిరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్షా–పే చర్చ కార్యక్రమంలో భాగంగా ఉమ్మరవల్లి డైట్ అధ్యాపకుడు ఎ.అప్పన్న పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎటువంటి భయం, ఒత్తిడికి గురవ్వకుండా పరీక్షలకు సన్నద్ధమవ్వాలని సూచించారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కంచిలి: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని డివిజనల్ యాంకర్ యశోద అన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, పప్పు దినుసులు, సుగంధ ద్రవ్యాలు, నూనె గింజలు, కూరగాయలు, ఆకుకూరలు కలిపి ఎకరాకు 12 కిలోలు చొప్పున వేసి 45 రోజులు సాగుచేసి, అనంతరం తర్వాత కలియదున్నడం వలన భూసారం పెరుగుతుందన్నారు. తద్వారా జీవవైవిధ్యం పెరుగుతుందని, వానపాములు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలు వలన అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మద్దు వెంకటరావు, మాస్టీల మన్మథరావు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఎం.టి.సత్యనారాయణ, ఎల్.శివానంద్, లోహిదాసు, తులసయ్య, మహిళా సంఘ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి


ప్రవచనాలు బోధిస్తున్న సిద్దార్థ బంది స్వామి

నందిగాం: విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని ఆధ్యాత్మిక గురువు బౌద్ధ సిద్ధాంతి సిద్దార్థ బంది స్వామి అన్నారు. మండలంలోని నౌగాం ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఎం.శ్రీనివాసదాస్ అధ్యక్షతన సర్పంచ్ పుష్పా సత్యం, ఎంపీటీసీ బార్నన బాలకృష్ణారావు ఆధ్వర్యంలో మాజీ ఎంపీ కణితి విశ్వనాథం సౌజన్యంతో పాఠశాల విద్యార్థులకు నైతిక ప్రవచనాలు బుధవారం బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.ఆదినారాయణ, కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోపై 6ఏ కేసు నమోదు

కంచిలి: మండలంలోని బెల్లుపడ డిపోలో సీఎస్‌డీటీ పైడి కూర్మారావు నేతృత్వంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. డిపోలో పీడీఎస్ బియ్యం 857 కిలోలు, కందిపప్పు 96 కిలోలు వాస్తవంగా ఉండాల్సినవి నిల్వ లేకపోవడంతో డీలర్ గమ్మింగి సూర్యకళపై 6ఏ కేసుకు సిఫార్సు చేసినట్లు సీఎస్‌డీటీ తెలియజేశారు. విచారణలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.అపర్ణ, వీఆర్వోలు ఎం.బాలాజీ, సీహెచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


రేషన్ డిపోలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటబొమ్మాళి మండలం జీఎన్‌పేట గ్రామానికి చెందిన సంపతిరావు గజపతిరావు తన వ్యక్తిగత పనులు నిమిత్తం కె.కొత్తూరు గ్రామానికి వచ్చారు. తిరిగి రాత్రి సమయంలో రహదారిపై నడిచి వెళ్తుండగా అదే సమయంలో టీవీఎస్ ఎక్స్‌ఎల్ బండిపై తర్లిబొడ్డపాడు గ్రామానికి చెందిన కోరాడ వెంకటరావు అనే వ్యాపారి వస్తూ నడిచి వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. గాయపడిన వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

బొడ్డపాడు బృందం ప్రదర్శన


ప్రదర్శనలో పాల్గొన్న బొడ్డపాడు కళాకారులు

కాశీబుగ్గ: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరుగుతున్న సీపీఐఎంఎల్ లిబరేషన్ 11వ జాతీయ మహాసభల్లో పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన జన సాంస్కృతిక మండలి ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రామం నుంచి వెళ్లిన కళాకారులకు అవకాశం రావడంతో అమరుల పాటకు నృత్యాలు చేపట్టారు. వీరిని పలువురు అభినందించారు.

కేన్సర్‌పై అప్రమత్తత అవసరం


ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పలాస ప్రభుత్వ హైస్కూల్, గౌతమి పాఠశాలలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మాజీ ఎంపీ కణితి విశ్వనాథం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నెమలపురి అప్పారావు, కార్యదర్శి తమ్మినాన మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలతో పని చేయించడం నేరం

ఇచ్ఛాపురం రూరల్: చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని నియోజకవర్గ కార్మికాధికారి పి.సూర్యనారాయణ అన్నారు. రెవెన్యూ, ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ సిబ్బందితో కలిసి లొద్దపుట్టి, ఈదుపురం, మశాఖపురం, బిర్లంగి ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుక బట్టీల్లోని కార్మికులకు యాజమాన్యం మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్మికులు తమ పిల్లలను బడులకు పంపించాలని అవగాహన కల్పించారు. ఆయనతో పాటు ఎస్‌ఐ ఎల్.వెంకటరావు, ఏఎస్‌ఐ డి.రమణమూర్తి, కృష్ణబాబు, సీహెచ్ సూర్యనారాయణలు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: బాలల హక్కులకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కార్మికశాఖాధికారి పి.సూర్యనారాయణ అన్నారు. బాలల హక్కుల ఉల్లంఘన తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి రత్తకన్న పరిసర ఇటుక బట్టీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనంతరం వివిధ విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఇటుక బట్టీ వద్ద కార్మికులతో అధికారులు

అక్రమ రవాణా కట్టడికి చర్యలు

ఇచ్ఛాపురం రూరల్: మానవ అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్ అన్నారు. మండలంలో ఎం.తోటూరు గ్రామంలోని ఒక ప్రైవేటు ఉన్నత పాఠశాలలో 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్'పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ రవాణా నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చదువులేని పేదవారికి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గ్యాంగ్‌లు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడడం, బాలికలపై అనుచితంగా ప్రవర్తించడం వంటివి ఎదురైతే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో మానవ అక్రమ రవాణా నివారణ ఎస్‌ఐ ఎల్.వెంకటరావు, ఎన్‌సీఎల్పీ ప్రోగ్రామ్ మేనేజర్ పెంకి బాలకృష్ణ, లేబర్ ఆఫీసర్ పి.పి.సూర్యనారాయణ, ఏఎస్‌ఐ రమణమూర్తి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ లిమ్మాయి, గెస్ట్ చైల్డ్‌లైన్ ప్రతినిధులు వకీల కృష్ణంరాజు, సంతూ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ గురుప్రసాద్

భక్తిశ్రద్ధలతో పూజలు

కంచిలి: మండల కేంద్రంలోని ఓం శాంతి మందిరంలో ముందస్తు మహా శివరాత్రి ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. ముందుగా ఓం శాంతి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహా శివరాత్రి పూజ చేసి, పర్వదినం గొప్పతనాన్ని బ్రహ్మకుమారి వరలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి కృష్ణవేణి, లతాశ్రీ, కైలాష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి శివరాత్రి ఉత్సవాలు

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నహరిశ్చంద్రపురం పంచదామ క్షేత్రంలో ఈనెల 17 నుంచి 19 వరకూ శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అలయ ధర్మకర్త ఉప్పాడ కనకరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మూడు రోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.


కంచిలి: పూజ చేస్తున్న బ్రహ్మకుమారిలు